క్లుప్తంగా

నేడు మంత్రి రాజా ఎన్నికల ప్రచారం

తొండంగి: మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీలోకి అలమండ మధు



లింగంపర్తిలో మధుకు పార్టీ కండువా వేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ఏలేశ్వరం మాజీ సర్పంచ్ అలమంద శ్రీరామమూర్తి కుమారుడు అలమండ మధు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని లింగంపర్తిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు తన స్వగృహం వద్ద మధుకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. అన్నివర్గాలకూ మేలు చేసిన సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ చైత్ర మాసోత్సవాలు ప్రారంభం

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయంలో పండితులు కలశస్థాపన, మండపారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రుత్విక్కులు అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. 11 గంటలకు అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ చైత్ర మాసోత్సవాలు వచ్చే నెల 8వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు గరగల సంబరం నిర్వహిస్తారని వివరించారు.

'జగన్ కోసం సిద్ధం'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్

గోకవరం: జగన్ కోసం సిద్ధం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు విజయవంతం చేయాలని ఆ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా జేసీఎస్ కన్వీనర్, తుని ఎన్నికల పరిశీలకులు డాక్టర్ ఒమ్మి రఘురామ్ పిలుపునిచ్చారు. గోకవరంలోని గోపికృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం పార్టీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కరోనా కష్టకాలంలో సైతం పథకాలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 248 బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీయాలి

ఏలేశ్వరం/జగ్గంపేట: ప్రజా సమస్యలపై పాలక, ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నిలదీయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా, సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న ప్రజా చైతన్య యాత్ర సోమవారం ఏలేశ్వరం, జగ్గంపేటలో జరిగింది. అరుణోదయ కళాకారులు ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వీరాంజనేయులు మాట్లాడుతూ 73 ఏళ్లుగా రాజకీయ పార్టీలు ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. శ్రీకాకుళం వరకూ సాగే ప్రజా చైతన్యయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, భాస్కర్, కుంచే అంజిబాబు, బి.గంగ, దేశెట్టి సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వండి



హంసవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



జిల్లేడుపాడులో ప్రత్యేక వాహనంపై మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

- మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించడం ద్వారా సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా కోరారు. మండలంలోని హంసవరం, జిల్లేడుపాడు, హెచ్.కొత్తూరు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పే సూపర్ సిక్స్, తమ ప్రభుత్వంపై చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. అన్నివర్గాల ప్రజలకూ అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించే సత్తా సీఎం జగన్‌కే ఉందన్నారు. అధికారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు తప్పుడు ప్రచారాలకు తెర తీశారన్నారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టీడీపీ వంద శాతం విఫలమైందన్నారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ఇప్పుడు ఓట్లు అడుగుతున్నామన్నారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వంలో మరింత సమర్థవంతంగా పథకాలు అమలు చేస్తామన్నారు. మీ కుటుంబాలకు మంచి జరిగిందని భావిస్తే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవానీ, సర్పంచులు రాయి మేరీ అవినాష్, కటారి సుబ్బారావు, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, రాయి దాసు, పల్లేటి అచ్చారావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



తునిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్ మల్లిక్, చైర్‌పర్సన్ సుధారాణి

ప్రజలు వైఎస్సార్ సీపీకి అనుకూలం

తుని: గడిచిన నాలుగున్నర ఏళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని, ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేయడానికి తహతహలాడుతున్నారని మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. తుని ఒకటో వార్డులో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వార్డు కౌన్సిలర్ వారాధి జ్యోతి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పథకాల కొనసాగింపు

- ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు
- ఏలేశ్వరంలో ఎమ్మెల్సీ అనంతబాబుతో కలిసి భారీ ఎన్నికల ర్యాలీ



ఏలేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సునీల్, వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు సాధ్యమని ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఏలేశ్వరం పట్టణంలో ఎమ్మెల్యే అనంతబాబుతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక లింగవరం కాలనీ నుంచి ప్రధానరహదారి, బాలాజీ చౌక్ మీదుగా ర్యాలీ జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ ఎన్నికల్లో నాలుగు పథకాలతో సొంత మేనిఫెస్టో రూపొందించానన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో 400 గ్రామాలను దత్తత తీసుకుని రూ.400 కోట్లతో అభివృద్ధి చేస్తానన్నారు. రూ.100 కోట్లతో నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నివర్గాలకూ పథకాలు వర్తింప చేశారన్నారు. జగన్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ రీల్ స్టార్ అయితే సీఎం జగన్ రియల్ స్టార్ అన్నారు. పంచాయతీ వార్డు మెంబర్‌గా నెగ్గలేని పవన్ తమను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత మాట్లాడాలని పవన్‌కు సూచించారు. పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, బదిరెడ్డి గోవిందు, పైల సుభాష్ చంద్రబోస్, శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, పర్వత రాజబాబు, బెహరా రాజేశ్వరి, గోళ్ల కాంతిసుధాకర్, వరుపుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో వరుపుల రాజ్యలక్ష్మి ప్రచారం

అన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కుమార్తె రాజ్యలక్ష్మి కోరారు. అన్నవరంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి నారాయణరావు పాల్గొన్నారు.



అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు కుమార్తె రాజ్యలక్ష్మి

175 నియోజకవర్గాల్లో పిఠాపురానికే ప్రథమ స్థానం



కిర్లంపూడిలో ముద్రగడను కలసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

- కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం
- పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని పిలుపు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి పిఠాపురంలో జరిగేలా కృషి చేస్తామని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల కన్న పిఠాపురం నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజల ఆర్థికాభివృద్ధిని పెంచేలా కృషి చేయాలని తానే స్వయంగా జగన్‌ను కోరతానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, పిఠాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ఆయనను, యువ నాయకుడు గిరిబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ ముఖానికి రంగులు వేసుకుని వచ్చేవారి మోజులో పడి యువత చెడిపోవద్దన్నారు. తమ పిల్లలు ఆర్థికంగా బలపడేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువత చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా సబ్సిడీతో కూడిన రుణాలను ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం వచ్చే ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, పిఠాపురం ఎమ్మెల్యేగా వంగా గీతను, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును గెలిపించాలని కోరారు. వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలోని తన విజయానికి కృషి చేస్తున్న ముద్రగడ పద్మనాభానికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన సూచనలు, సలహాలతో ప్రచారంలో ముందుకు సాగుతున్నానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఎస్.తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం



మల్లేపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట శ్రీనిధి

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, తామరాడ, రామచంద్రపురం గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అడుగడుగునా పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయన్నారు. వెళ్లిన ప్రతి గ్రామంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మరోసారి సీఎం కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కోడలు తోట శ్రీనిధి అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బిత్రా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య
- ఎస్.అన్నవరంలో ఎన్నికల ప్రచారం



ఎస్.అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య

తుని రూరల్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి దాడిశెట్టి లక్ష్మీచైతన్య పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్.అన్నవరంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, పలువురు మహిళలతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక పరంగా మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అక్కచెల్లెమ్మలు మద్దతుగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు కుసనం పూర్ణిమా శాంతి, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి వాసు, వంగలపూడి మహేష్, భీమనాదుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- కాట్రావులపల్లిలో ఎన్నికల ప్రచారం



కాట్రావులపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

జగ్గంపేట: రాష్ట్ర భవిష్యత్ కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ పాలన సాగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మలిరెడ్డి సత్తిబాబు, సిరిమల్లిదొర, పైలా చైతన్య, బిందనపు పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు బరిలో 15 మంది

ప్రత్తిపాడు: నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం సాయంత్రంతో ముగిసింది. ప్రత్తిపాడులో అభ్యర్థులెవ్వరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. దీంతో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి 18 మంది అభ్యర్థులు 30 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన ఇద్దరు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి బత్తిన సింహాచలం అభ్యర్థిత్వాన్ని 10 మంది ప్రతిపాదించాల్సి ఉండగా తొమ్మిది మంది మాత్రమే ప్రతిపాదించడంతో దానిని తిరస్కరించారు. ఎన్నికల పోటీలో నిలిచిన అభ్యర్థుల అక్షరమాలను బట్టి వరస క్రమాన్ని, పార్టీ గుర్తులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు ప్రకటించారు. కాగా వైఎస్సార్ సీపీ నుంచి వరుపుల సుబ్బారావు, టీడీపీ నుంచి వరుపుల సత్యప్రభ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నుంచి ఏగుపాటి అర్జునరావు, పలు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలో ఉన్నారు.

తుని అసెంబ్లీ బరిలో 11 మంది అభ్యర్థులు

తుని: తుని అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి సోమవారం తెలిపారు. కర్రి నూకరాజు(బహుజన సమాజ్ పార్టీ), గేలం శ్రీనివాసరావు (కాంగ్రెస్), దాడిశెట్టి రాజా (వైఎస్సార్ సీపీ), యనమల దివ్య (టీడీపీ), యాదాల రామకృష్ణ (రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా), వాడబోయిన శివ(సీపీఐ ఎంఎల్ లిబరేషన్), సతీష్ దుత్తిర్తి (దళిత బహుజన పార్టీ), ఆది వెంకట సత్యనారాయణ వేగి(స్వతంత్ర అభ్యర్థి), కోన రామకృష్ణ(స్వతంత్ర), తమరాన అప్పారావు (స్వతంత్ర), బోడపాటి శ్రీనివాసరావు (స్వతంత్ర) తుది జాబితాలో ఉన్నారన్నారు. వీరందరికీ ఎన్నికల గుర్తులు కేటాయించినట్టు తెలిపారు.

'ముత్తంగి' అలంకరణలో సత్యదేవుని దర్శనం

- స్వామివారిని దర్శించిన 30 వేల మంది
- దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లు ముత్తంగి వస్త్రాలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి, అమ్మవార్లు, శివలింగాన్ని ముత్యాల కవచాలతో అలంకరిస్తున్న విషయం విదితమే. దీనిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేయగా వేలసంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.

కిటకిటలాడిన ఆలయం

రత్నగిరిపై సత్యదేవుని ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండువేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 4 వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

ఆలయ ప్రాకారంలో గ్రీన్ షెడ్ ఏర్పాటు

సత్యదేవుని ఆలయప్రాకారంలో భక్తులకు ఎండ తగలకుండా గ్రీన్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో గ్రీన్ షెడ్ తక్కువ ఎత్తులో ఉండేది. రథోత్సవంలో రథానికి అది తగలడంతో దానిని తొలగించి ఎత్తుగా వేశారు. దానికి తోడు కింద కార్పెట్ వేసి దానిని తడపడం ద్వారా భక్తులకు ఎండ నుంచి రక్షణ కల్పిస్తున్నారు.

దాసరి విశ్వనాథ్, సాయిజలకు సత్కారం



సాయిజ రచించిన రంగాపుర విహార నవలను ఆవిష్కరిస్తున్న కుంచె రఘు, తదితరులు

గోకవరం: అంతర్జాతీయ నవలా రచయిత, సినీ దర్శకుడు దాసరి విశ్వనాథ్ వెంకట్, అతని సోదరి సాయిజలను గోకవరంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రముఖ సినీ నటుడు, సంగీత దర్శకుడు, గాయకుడు కుంచె రఘు చేతులమీదుగా వీరిని సత్కరించారు. దాదాసాహెబ్ పాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ పురస్కారాల్లో 60 దేశాల నుంచి వచ్చిన పదివేలకు పైగా షార్ట్ ఫిల్మ్‌లు పోటీపడగా, వీటిలో గోకవరానికి చెందిన దాసరి విశ్వనాథ్ వెంకట్ దర్శకత్వం వహించిన షార్ట్ ఫిల్మ్ ×కలయే వసంతం° టైటిల్ విన్నర్‌గా నిలిచింది. విశ్వనాథ్ వెంకట్ ఉత్తమ షార్ట్ ఫిల్మ్ దర్శకుడిగా అవార్డు అందుకున్నాడు. విశ్వనాథ్‌తో పాటు అతని సోదరి సాయిజ దర్శకత్వం వహించిన వండర్ వుమెన్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియా వెబ్‌సిరీస్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. దీంతో వారిద్దరినీ సోమవారం గోకవరంలో కుంచె రఘు సత్కరించారు. అనంతరం సాయిజ రచించిన రంగాపుర విహార నవలను విశ్వహిందూ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, సాయిజ తల్లిదండ్రులు దాసరి రాధాకృష్ణ, సత్య, శ్రీధర్మదర్శినీ జ్ఞానపీఠం వ్యవస్థాపకుడు, కూచిపూడి నాట్యాచారుడు దాసరి ధర్మరాజు, సినీ దర్శకుడు ఆనంద్ గుబ్బల, డాక్టర్ బద్దిరెడ్డి రామారావు, నటుడు రవి తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు మణిరత్నం రాజీనామా

గోకవరం: మండలంలో జనసేన పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవం లేని చోట ఇమడటం కష్టమన్నారు. పార్టీ మండలాధ్యక్షుడిగా తనకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో జనసేన ఆవిర్భావం నుంచి పార్టీకి కష్టపడి పని చేశామన్నారు. ఇతర పార్టీలతో పొత్తు కారణంగా ఎక్కడికక్కడ జనసైనికులకు అవమానాలు ఎదురవుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో తన కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

జనసేన రెబల్ అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు

గోకవరం: జగ్గంపేట జనసేన రెబల్ అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్రకు ఈసీ గాజుగ్లాసు కేటాయించింది. జగ్గంపేటలో మొత్తం 19 మంది నామినేషన్లు దాఖలు చేయగా రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకోగా 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ప్రధాన పార్టీ అభ్యర్థులైన తోట నరసింహానికి ఫ్యాన్, టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూకు సైకిల్ గుర్తులు కేటాయించగా జనసేన నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీలో నిలిచిన పాటంశెట్టికి గాజు గ్లాసు దక్కింది. ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థులకు గాజుగ్లాసు గురించి లాటరీ వేయగా లాటరీలో ఆయన గాజుగ్లాసు గుర్తు దక్కించుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థికి కేటాయించినట్టు ఆర్వో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పాటంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ తాను, తన భార్య శ్రీదేవి పడిన కష్టానికి దేవుడిచ్చిన గుర్తు గాజుగ్లాసు అన్నారు. ఐదేళ్ల కాలంలో కొన్ని లక్షల సార్లు ఈ గుర్తు గురించి ప్రజలకు చెప్పానన్నారు. గుర్తించాల్సిన వాళ్లు గుర్తించకపోయినా దేవుడి గుర్తించి తన గాజుగ్లాసు గుర్తుని తనకు కేటాయించాడన్నారు. తాను ఎవరినో ఓడించడానికో, గెలిపించడానికో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే బలమైన లక్ష్యంతో పోటీ చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా జనసేన రెబల్ అభ్యర్థికి గాజుగ్లాసు కేటాయించడంతో జగ్గంపేటలో టీడీపీకి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. ఇక్కడ జనసేన పోటీలో లేకపోవడం, ఇప్పటికే గాజు గ్లాసుతో అనేకసార్లు ప్రచారం నిర్వహించిన పాటంశెట్టి ప్రజల్లో దూసుకుపోవడంతో తమకు ఇబ్బందికరంగా మారుతుందనే గుబులు ఆ నేతల్లో మొదలైంది.